క్లుప్తంగా

'మార్కెట్‌కు మల్లేశ్ పేరు పెట్టాలి'


అడిషనల్ కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్‌కు దివంగత మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ పేరు పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యుడు మేకల దాసు అన్నారు. అడిషనల్ కలెక్టర్ ఎస్.మోతిలాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు జోగుల మల్లయ్య, లింగం రవి, మిట్టపల్లి పౌల్, చాడ మహేందర్ రెడ్డి, దేవీ పోచన్న, బియ్యాల ఉపేందర్, జీసీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


విద్యార్థి నోట్‌బుక్‌ను పరిశీలిస్తున్న డీఈవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామంలోని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి(డీఈవో) యాదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జరుగుతున్న బోధనా తీరును పరిశీలించిన అనంతరం విద్యార్థులతో నేరుగా సమీక్ష జరిపారు. విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. వారి సామర్థ్యాలను పర్యవేక్షించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

నస్పూర్: పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ ఫైల్స్, దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్సై సుగుణాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: భవన నిర్మాణ రంగం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న అన్నారు. కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. జిల్లాలో ఇసుక రిచ్ ఏర్పాటు చేయాలని, కార్మిక వెల్ఫేర్ బోర్డుకు చైర్మన్‌ను నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూరన్న, పట్టణ అధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి చింతల మల్లేష్, సలహాదారు కోటన్న, పట్టణ ఉపాధ్యక్షుడు సంతోష్, భీమన్న, రాజు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్'

జన్నారం: పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మండలకేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఆయుధాల గురించి ఎస్సై రాజవర్ధన్ వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వహణ, రిసిప్షన్‌లో ఫిర్యాదు చేసే విధానం, డయల్ 100, ఫింగర్ ప్రింట్ స్కానర్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపైనే తిష్ట

- రోజంతా మున్సిపాలిటీ రహదారులపైనే మూగజీవాలు
- పశువులు, శునకాలు, పందులతో తీవ్ర ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని బల్దియా అధికారులు


తిలక్ స్టేడియం వద్ద రోడ్డుపై ఉన్న పశువులు

బెల్లంపల్లి: బల్దియా రోడ్లపై మూగజీవాలు గుంపులుగా సంచరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై నిద్రిస్తున్న పశువులను ఢీకొని వాహనదారులు గాయపడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కన్నాల బస్తీ నుంచి ఏఎంసీ ఏరియా వరకు...

బెల్లంపల్లి మున్సిపాలిటీలో రోడ్లపై పశువులు, కుక్కలు, పందులు తీవ్రంగా సంచరిస్తున్నాయి. రోడ్ల మీద కుక్కలు వదుల సంఖ్యలో ఉంటుండగా, అంతే స్థాయిలో పశువులు తిరుగుతున్నాయి. పందులు గుంపులుగా రోడ్డుపై పరుగెడుతూ ఇబ్బందికరంగా తయారయ్యాయి. మున్సిపల్ పరిధిలోని కన్నాల బస్తీ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి కొత్త బస్టాండ్ ఏరియా, పాత బస్టాండ్, బజారు ఏరియా, కాంటా చౌరస్తా, బూడిద గడ్డ బస్తీ క్రాస్‌రోడ్ మీదుగా ఏఎంసీ వరకు మూగ జీవాలు రోడ్డుపై తిష్టవేసి ఉంటున్నాయి. కనీస బాధ్యత లేకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం యజమానులకు పరిపాటిగా మారింది.

ట్రాఫిక్ సమస్యలు...

ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాల వైపునకు, మంచిర్యాల ప్రాంతం నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, సరుకులు తీసుకొచ్చే లారీలు, వ్యాన్‌లు ఇతర వాహనాలు బజారు ఏరియా రోడ్డుమీదుగానే రాకపోకలు సాగిస్తాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో వెళ్తుంటాయి. ఎప్పుడు చూసినా బజారు ఏరియా రోడ్డుపై వాహనాలు, జనసంచారంతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపైనే మూగజీవాలు పడుకొని, కదలకుండా ఉంటుండటంతో రోజువారీగా ట్రాఫిక్ సమస్యలు కలుగుతున్నాయి. జీవాలను రోడ్డు మీద నుంచి పక్కకు తప్పించేందుకు వాహనదారులు ఎంతగా హారన్ కొట్టినా కదలకుండా స్థిరంగా ఉంటున్నాయి. రాత్రిపూట సైతం రోడ్డుమీద నిద్రిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి ద్విచక్రవాహన దారులు ఒక్కోసారి జీవాలను ఢీ కొంటున్నారు. ఈ ఘటనల్లో వాహనదారులతో పాటు జీవాలు సైతం గాయపడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు జీవాల యజమానులకు జరిమానా విధించి నిలువరించకుండా ఉండటాన్ని తప్పు పడుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఏఎంసీ ఏరియా తహసీల్దార్ కార్యాలయం ముందు నెల రోజుల క్రితం ద్విచక్రవాహనం పై వెళ్తున్న ఇద్దరు యువకులు వేగంగా వెళ్లి రోడ్డుపై పశువులను ఢీ కొట్టడంతో కిందపడి గాయపడ్డారు.
- పది రోజుల క్రితం కాంటా చౌరస్తాలో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలను బైక్ పైవెళ్తున్న వ్యక్తి ఢీ కొట్టడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.
- బజారు ఏరియా నుంచి ఏఎంసీ వైపునకు వెళ్తున్న ఓ వాహనదారుడికి కోర్టు వద్ద గుంపులుగా పందులు వేగంగా వచ్చి ఢీ కొట్టి కింద పడేశాయి. వాహనదారుడికి తృటిలో ప్రమాదం తప్పింది.
- పాత బస్టాండ్ ఏరియా తిలక్ స్టేడియం ముందు ఓ వాహనదారుడు వారం రోజుల క్రితం రాత్రిపూట రోడ్డుపై పడుకుని ఉన్న పశువులను ఢీ కొట్టడంతో కిందపడి తలకు గాయాలయ్యాయి.

గోశాలకు తరలిస్తాం..

పెంపుడు జంతువుల యజమానులు విధిగా సంరక్షణ చర్యలు తీసుకోవాలి. ఆవులు, గేదెలను రోడ్లపై వదిలేయొద్దని ఇప్పటికే తెలియజెప్పాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోం. వెంటనే కట్టడి చర్యలు తీసుకోవాలి. లేకపోతే రోడ్లపై తిరుగుతున్న జీవాలను గోశాలకు తరలిస్తాం.

- కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

సమాచారం

నియామకం

బెల్లంపల్లి: లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన మున్సిపల్ కౌన్సెలర్ బుక్య రాములు నాయక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ ఆదేశాల మేరకు రాములునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్ నాయక్ ప్రకటించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 17న శ్రీరాంపూర్‌లో నిర్వహించిన అండర్-14, 17 విభాగంలో పెన్సింగ్ క్రీడా పోటీల్లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పోటీల్లో దీక్షిత, నిత్యశ్రీ, యోగితశ్రీ, విష్ణుప్రియ, సిద్ధార్థ్, శివమిత్ర, సాయబ్, అశ్విత్, సాత్విక్, మణిదీక్షిత్, అధిత్య, హర్షిత్‌లు ఎంపిక కాగా విద్యార్థులను ప్రిన్సిపాల్ జోబిన్, ఏవో విలాస్, పీఈటీలు కుమార్, రాజేందర్ అభినందించారు.

కొటేషన్ల స్వీకరణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఎక్స్ట్రా పల్మనరీ ట్యూబర్క్యులోసిస్(టీపీటీబీ) సర్వీసెస్ అందించేందుకు గాను అనుభవజ్ఞులైన రిజిస్టర్డ్ డయాగ్నోసిస్ సెంటర్స్ నుంచి కొటేషన్లను స్వీకరించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వివరాల కోసం కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 25 నుంచి 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సంప్రదించాలన్నారు.

హాజీపూర్‌లో కలెక్టర్ పర్యటన

- పాఠశాలలు, పీహెచ్‌సీ, నర్సరీల పరిశీలన
- అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశం


వేంపల్లిలో నర్సరీ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ విస్తృతంగా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పాఠశాలలను పరిశీలించారు. మండలంలోని వేంపల్లి గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముల్కల్ల గ్రామంలోని కంపోస్ట్ షెడ్‌ను సందర్శించారు. తడి, పొడి చెత్త నుంచి తయారు చేసే ఎరువు తయారీని మొక్కల పెంపకంలో వాడాలన్నారు. గుడిపేటలో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని ఆదేశించారు. అనంతరం హాజీపూర్ పీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయనే వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారిణి లహరితో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. రికార్డులు, మందుల నిల్వలు, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి ఆవరణలోని నర్సరీ సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణ వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి సబ్బెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

బెల్లంపల్లి: మున్సిపల్ ఏఈ సందీప్, అతడి కుటుంబ సభ్యులను అవమానపరిచేలా విధంగా సామాజిక మాధ్యమాల్లో మున్సిపల్ కౌన్సెలర్ గడ్డం అశోక్‌గౌడ్ పోస్టులు పెట్టాడని ఆరోపిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు అధికారులు, సిబ్బంది సామూహికంగా విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కౌన్సెలర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని, మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై దురుసుగా వ్యవహరించడం మానుకోవాలని నినాదాలు చేశారు. ఏఈని అవమానించిన కౌన్సెలర్‌పై చర్యలు తీసుకునే వరకు విధుల్లో పాల్గొనబోమని పేర్కొన్నారు. అనంతరం బెల్లంపలి ఏసీపీ ఎ.రవికుమార్ కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అక్రమాలుంటే నిరూపించండి'

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిపాలనలో అక్రమాలు చేసినట్టు ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరూపించాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, దిగజారుడు మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస గౌడ్, నాయకులు శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, శ్రీనివాస రెడ్డి, చాతరాజు రాజన్న పాల్గొన్నారు.

'నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్'

మందమర్రిరూరల్: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు కేకే-5 గని ఏరియా, చైతన్య నగర్ ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 38ద్విచక్ర వాహనాలు, లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలు ఉండే అనుమానస్పదమైన ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ ద్వారా పరిశీలించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథ ఆలయంలో శివలీలా విలాసం ప్రవచనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానాన్ని నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మానందస్వామి సరస్వతీ గురువారం దర్శించుకున్నారు. దేవస్థానం సాంప్రదాయం ప్రకారం వారికి పూర్ణకుంభంతో మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ శివలీలా విలాసం ప్రవచనాలు పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తారవి, దేవాలయ ఉద్యోగులు, అర్చకులు గోవర్ధనభట్టాచార్య, నరహరిశర్మ, బాలక్రిష్ణ, శేషాచార్యులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనులు వేగవంతం చేయాలి

- డీఆర్‌డీవో కిషన్


నెన్నెలలో పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

నెన్నెల: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన నర్సరీల పనుల్లో వేగం పెంచి సకాలంలో మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలని డీఆర్‌డీవో కిషన్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. నెన్నెల, నందులపల్లి, గన్‌పూర్, గొల్లపల్లి గ్రామాల్లోని నర్సరీ పనులను గురువారం పరిశీలించారు. ఎర్రమట్టి, నల్లమట్టి సేంద్రీయ ఎరువులతో బ్యాగ్ ఫిల్లింగ్ చేయాలన్నారు. కానుగ, వెదురు, ఈత, తాటి, నీలగిరి మొక్కలతో పాటు పూలమొక్కలను పెంచాలన్నారు. గన్‌పూర్, నందులపల్లిలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మంజూరైన మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల పనులను ప్రారంభించారు. పనులలో నిర్లక్ష్యం చేయకుండా ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ నరేష్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు పద్మనాభం, సురేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

జన్నారం: నర్సరీల నిర్వహణలో నిర్వాహకులు అలసత్వం ప్రదర్శించొద్దని ఎంపీడీవో శశికళ అన్నారు. మండలంలోని మొర్రిగూడలో గురువారం నర్సరీని ఆమె పరిశీలించారు.

భీమారం: మండలంలోని కాజిపల్లి, ధర్మారం, నర్సింగాపూర్ గ్రామాల్లో నర్సరీల పనులను గురువారం ఎంపీడీవో మధుసూధన్, ఏపీవో జీనత్‌లు పరిశీలించారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు


కన్నాలలో ప్లాట్లు పరిశీలిస్తున్న డీపీవో

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామంలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు, పాఠశాల క్రీడా ప్రాంగణం, గ్రామ పంచాయతీ నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమల హిల్స్ వెంచర్‌లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుల భూములను, రఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి అనుమతులు అందేలా చూడాలని పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తపస్ కుమార్, శ్రీనివాస్, ప్రశాంత్, సతీష్, హర్షద్, ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'గైర్హాజరు లేకుండా పని చేయాలి'


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మేనేజర్ విజయ్‌కుమార్

శ్రీరాంపూర్: గనిపై సంవత్సరంలో 100 మస్టర్లు కూడా పనిచేయని ఉద్యోగులకు ఎస్సార్పీ 1 గని మేనేజర్ విజయ్‌కుమార్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులను పిలిచి ఎందుకు గైర్హాజరవుతున్నారని తెలుసుకుని, గైర్హాజరు లేకుండా పని చేయాలని సూచించారు. 100 మస్టర్లు కూడా నిండకుంటే కంపెనీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గని సంక్షేమ అధికారి ఎస్ సాధన్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య పాల్గొన్నారు.

యూనియన్ నేతలకు శిక్షణ

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మిక సంఘాల నేతలకు కార్మిక చట్టాలు, పారిశ్రామిక సంబంధాలు తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. సింగరేణి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ శిక్షణ ఇస్తున్నారు. గచ్చిబౌలిలోని ఈ కాలేజీలో బుధవారం ప్రారంభమైన శిక్షణ శనివారం వరకు కొనసాగనుంది. సింగరేణి నుంచి జీఎం కో ఆర్డినేషన్ సుభాని ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మిక చట్టాలు, గ్రాట్యూటీ స్కీం, ఇండస్ట్రీయల్ డిస్ప్యూట్ యాక్ట్, పెన్షన్, వెల్ఫేర్ తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. కార్మికులకు, కంపెనీకి మధ్య వారధిగా ఉండే యూనియన్ నాయకులు ఏ విధంగా వ్యవహరించాలో అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమానికి ఐఎన్టీయూసీ సెక్రెటరీ, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బీ.జనక్ ప్రసాద్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే.రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరబద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పని చేస్తున్న బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్ మహిళా కార్మికులకు సర్ఫేస్ ఉద్యోగాల కోసం శాంతిఖని గనిపై, మందమర్రి జీఎం ఆఫీస్‌లో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్ఫేస్ విభాగంలో 16డిజిగ్నేషన్‌లలో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆసక్తి కలిగిన విభాగంలో పనిచేయడానికి మహిళలకు అర్హత ఆధారంగా అవకాశం కలిపిస్తారని అధికారులు సూచించారు. కార్యక్రమంలో శాంతిఖని గని వద్ద మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గని సంక్షేమ అధికారి సత్యనారాయణ, మందమర్రి జీఎం ఆఫీస్‌లో ఎస్వోటు జీఎం రాజేశ్వర రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఐఈడీ రాజన్న, డాక్టర్ జయవాణి, డీవైపీఎం సత్యబోస్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు పాల్గొన్నారు.

నేడు

బెల్లంపల్లిలో మెగా రక్తదాన శిబిరం

బెల్లంపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ తెలిపారు. తన ఛాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. పట్టణంలోని పద్మశాలిభవన్‌లో ఉదయం 9-30గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమానికి రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. రక్తదానం చేయడం వల్ల రోడ్డు ప్రమాద బాధితులు, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల ప్రాణాలు కాపాడిన వారవుతారని పేర్కొన్నారు. రక్తదానం చేయడానికి ముందుకురావాలని కోరారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరానికి సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, యువకులు, రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ, పాత 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్ విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ వేణుగోపాల్ ఒకప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఏరియా, గోసేవ మండల్, రాంనగర్, ఎల్‌సీ కాలనీ, కాలేజ్‌రోడ్డు, పద్మశాలీ కాలని, ఎన్టీఆర్ నగర్, పాత మంచిర్యాల, చింతపండువాడ, రెడ్డికాలని, సంజీవయ్యకాలని, ఎడ్లవాడ, పవర్‌సిటీ, వైశ్యభవన్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వేరుశనగ,వరి పంటల పరిశీలన

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లో వేరుశెనగ సాగు చేస్తున్న రైతుల పంట క్షేత్రాలను గురువారం మండల వ్యవసాయ అధికారి సుధాకర్ సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

చెన్నూర్: చెన్నూర్ గోదావరి తీరా హనుమాన్ మందిర్ ప్రాంతంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతా మిర్చి పంట రైతులు గురువారం స్థానిక ఏఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోటపల్లి: విద్యార్థి దశ నుంచే అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రాజేందర్ విద్యార్థులకు సూచించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై రాజేందర్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, శ్యాం పాల్గొన్నారు.

భీమిని: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా గురువారం భీమిని మండల కేంద్రంలోని పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ఎస్సై విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

తాండూర్: మండలంలోని మాదారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సూరం రవీందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనంగా మరో ఉపాధ్యాయుడిని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరుచేయాలి

దండేపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ డిమాండ్ చేసింది. ప్రెస్‌క్లబ్‌లో గురువారం సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, 317జీవోతో నష్టపోయిన వారిని స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు పంపాలన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చెన్నయ్ షాపింగ్‌మాల్లో పని చేసే మహిళలకు, సిబ్బందికి మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై షీ టీమ్ ఎస్సై హైమ గురువారం అవగాహన కల్పించారు.